క్లుప్తంగా

డిగ్రీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: పట్టణంలోని శుభారాం డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. మూడేళ్ల డిగ్రీ కోర్సులకు ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. చేరదలచిన విద్యార్థులు కళాశాల పని దినాలలో సంప్రదించాలని కోరారు.

గంజాయి విక్రయాలపై నిఘా

పలమనేరు: పట్టణంలో గంజాయి విక్రయాలు, వాటిని వినియోగించేవారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్టు పట్టణ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పలమనేరులో ఇటీవల గంజాయి పీల్చే బ్యాచ్‌లున్నట్టు తెలియవచ్చిందని, గాంధీనగర్ శ్మశానం, ఏఎంసీ వెనుకవైపు, ఆర్టీసీ డిపోల వద్ద నిఘా పెట్టామన్నారు. పట్టణంలో ఓవర్‌స్పీడ్‌తో వెళ్లేవాళ్లు, సైలెన్సర్ తీసి నడిపేవాళ్లు, బైపాస్‌లో బైక్ రైడింగ్‌లపై దృష్టి పెట్టామని తెలిపారు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలు ప్రజలు గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

కౌండిన్యలో ఏనుగుల కట్టడికి చర్యలు

పలమనేరు: కౌండిన్యలో ఏనుగుల సమస్యను పరిష్కరించేందుకు కర్ణాటక రాష్ట్రంలో శిక్షణ పొందిన ఏనుగుల సేవలను వినియోగించుకుంటామని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తెలిపారు. చిత్తూరు డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డితో కలసి గురువారం ఆయన అటవీశాఖ ఏర్పాటు చేసిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీం ఎలిఫెంట్ డ్రైవ్ వాహనాన్ని ప్రారంభించారు. ఇటీవల ఏనుగు దాడిలో మృతి చెందిన పెద్దకాప్పల్లె పంచాయతీ జిట్టంవారిపల్లెకు చెందిన గంగయ్య భార్య మునిలక్ష్మమ్మకు రూ.5లక్షల చెక్కును అందజేసి మాట్లాడారు. ఎక్స్‌ప్రెస్ హైవేకు స్థలాన్ని ఫారెస్ట్‌లో కేటాయించడంతో రూ.18 కోట్ల దాకా పరిహారం అటవీ శాఖకు అందిందన్నారు. ఈ నిధులతో కౌండిన్యలో ఏనుగుల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఎఫ్‌ఆర్వో శివన్న, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



గుడిపాల: కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందింది. మండలంలోని అడవిచేను గ్రామంలో గురువారం సాయంత్రం ఓ జింక గ్రామంలోకి చొరబడింది. గమనించిన వీధికుక్కలు దాన్ని వెంబడించి దాడి చేయడంతో జింక మృతిచెందింది. వెంటనే స్థానికులు గమనించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుసుమకు సమాచారం అందించారు. ఆమె వెటర్నటీ డాక్టర్ సాయిసుధకు సమాచారం అందించారు. ఆమె జింకకు పోస్ట్‌మార్టం నిర్వహించి ఖననం చేశారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు

తవణంపల్లె: వృద్ధాప్యంలో ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని తెల్లగుండ్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 35 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

తల్లికి వందనం.. ఎందరికో.. ఎప్పటికో!

- ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ అన్నారు
- ఇప్పుడేమో ఇంట్లో ఒకరికేనంటూ ఆదేశాలు
- ఇద్దరు, ముగ్గురు పిల్లలున్న తల్లులకు తప్పని ఆవేదన
- ఫీజులు కట్టాల్సిందేనంటున్న ప్రైవేటు స్కూళ్లు



పలమనేరు: ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ 'తల్లికి వందనం' పేరిట రూ.15వేలు చొప్పున ఇస్తామని టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించింది. ఆపై ఎన్నికల సమావేశాల్లోనూ ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడుతో సహా నాయకులందరూ ఇదే అంశాన్ని ఊదరగొట్టారు. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాలుక మడతేసింది! ఇంటిని యూనిట్‌గా ఓ తల్లికి మాత్రమే పథకం అమలవుతుందని జీవో జారీ చేసింది. అదీగాక విద్యార్థికి 75శాతం హాజరు తప్పకుండా ఉండాలని, ఆ కుటుంబం దారిద్ర్యరేఖకు దిగువన ఉండాలని జీవోలో స్పష్టం చేసింది. ఈ లెక్కన గత ప్రభుత్వంలో లబ్ధిపొందిన వారిలో 70 శాతం మందికి 'తల్లికి వందనం' హుళక్కేననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పలమనేరు నియోజవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కళాశాలకు వెళ్లే పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బడులు పునఃప్రారంభమైన వెంటనే ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు చెల్లించాలని నిర్వాహకులు ఒత్తిడి తెస్తున్నారు. తల్లికి వందనంతో తమకేమీ సంబంధం లేదని, తొలుత ఫీజులు కట్టాల్సిందేనని ప్రైవేటు యజమాన్యాలు నిక్కచ్చిగా చెబుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు దిక్కు తోచడం లేదు.

ఇదేనా బాధ్యత 'బాబూ'?

- ప్రశ్నిస్తున్న పిల్లల తల్లిదండ్రులు

పుంగనూరు: 'తల్లికి వందనం' హామీ నెరవేర్చే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోత పెట్టడమే పనిగా పెట్టుకున్నారని జీవో విడుదలపై విమర్శలొస్తున్నాయి. 'ఇంట్లో ఒక్కరు చదువుతున్నా..ఇద్దరు చదువుతున్నా..ముగ్గురు చదువుతున్నా వారందరి బాధ్యత నేను తీసుకుంటా..అందరికీ తల్లికి వందనం ఇస్తా'' అని ఎన్నికల ముందు ప్రకటించిన చంద్రబాబు తీరా ఇప్పుడు జీవోతో షాక్ ఇచ్చారని పిల్లల తల్లిదండ్రులు కొందరు వాపోతున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో మున్సిపాలిటీతో పాటు ఆరు మండలాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం స్కూళ్లు 395 ఉన్నాయి. వీటిలో 25,473 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇవికాక ప్రైవేటు పాఠశాలలు 35 ఉన్నాయి. వాటిలో సుమారు 6వేల మంది చదువుతున్నారు. జీవో విడుదల నేపథ్యంలో వీరిలో ఎంతమందికి తల్లికి వందనం వస్తుందో..కోతలు పడుతాయో వేచిచూడాలి.

అసలు వస్తుందో రాదో కూడా తెలీదు...



నా ఇద్దరు పిల్లలు. పలమనేరులోని ప్రైవేటు స్కూల్, కాలేజీలో చదువుతున్నారు. కాలేజీవాళ్లు మాత్రం ముందుగా ఫీజు కట్టమంటున్నారు. 'తల్లికి వందనం' వస్తుందని చెబితే.. అది వస్తుందో రాదో మాకు అవసరం లేదని కాలేజీ వాళ్లంటున్నారు. ఏమి చేయాలో మాకైతే అర్థంకాలేదు. మొన్న ఎన్నికలపుడు చంద్రబాబు ఎంతమంది పిల్లలుంటే అందరికీ అన్నారు. ఇప్పుడేమో ఒక్కరికేనట.. అదెప్పుడు ఇస్తారో కూడా తెలీదు. -చంద్రమ్మ, పాతపేట

'అమ్మ ఒడి' కంటే ఎక్కువ ఇస్తారనుకున్నా..!



నాకు ఇద్దరు పిల్లలు. మా ఊరిలోని ప్రభుత్వ బడికెళ్తున్నారు. ఇంతకు ముందు అమ్మ ఒడిలో రూ.15వేలు వస్తా ఉండేది. మాకు కష్టం లేకుండా ఉండేది. ఈ ప్రభుత్వంలో చంద్రబాబు నా ఇద్దరు పిల్లలకు 30వేలు ఇస్తాడులేనని ఆశపడి నమ్మినా. ఇప్పుడు జూస్తే గందరగోళంగా ఉంది కదా సామీ! -కవిత, గంటావూరు కాలనీ, పలమనేరు

మా ఫొటోలు పేపర్‌కి వద్దు

మాకు ఇద్దరు పిల్లలు. కొడుకు ఇంటర్ సెకండియర్, కూతురు ఏడో తరగతి చదువుతున్నారు. స్కూల్లో ముందుగా డబ్బు కట్టమంటున్నారు. 'తల్లికి వందనం' ఇస్తే మీరే తీసుకోండని సలహా ఇస్తున్నారు. ఇంట్లో ఎంతమంది బడికిపోతే వాళ్లందరికీ 15వేలని నమ్మినాం. ఇప్పుడు ఏం చేస్తారో ఏమో!? నా ఫొటో కూడా పేపర్‌లో వేయద్దండి. -మాధవి, పలమనేరు

చేప పిల్లలను చెరువుల్లో వదిలారు



చెరువుల్లో చేపపిల్లలను వదులుతున్న ఆరోగ్య సిబ్బంది



డెంగీపై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

పలమనేరు: స్థానిక వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పలమనేరు, గంగవరం మండలాల్లోని దండపల్లె, బొమ్మనపల్లె, కీలపట్ల, కూర్మాయి తదితర గ్రామాల చెరువుల్లో గురువారం గంబూసియా చేపపిల్లలను వదిలారు. వీటిని చెరువుల్లో వదలడంతో దోమల లార్వాలను ఈ చేపలు తినేస్తాయని సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ తెలిపారు. దీంతో డెంగీని కొంతవరకు అరికట్టవచ్చని పేర్కొన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాలో భాగంగా ఈ చేపపిల్లలను వదిలినట్లు చెప్పారు. అలాగే పట్టణంలో సైతం డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యకార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ



సీఐ, ఎస్‌ఐతో సమీక్షిస్తున్న డీఎస్పీ

చౌడేపల్లె: స్థానిక పోలీస్ స్టేషన్‌ను పలమనేరు డీఎస్పీ విష్ణు రఘువీర్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేసుల పురోగతిపై సీఐ కృష్ణారెడ్డి, ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డిలతో సమీక్షించారు. అలాగే ఎస్సీ ఎస్టీ కేసులను విచారణ చేశారు. రాత్రి వేళ గస్తీ ముమ్మరంగా చేయడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి డ్రైవర్లు, యువతతో చైతన్యం తేవాలన్నారు.

పలమనేరులో నీటి నాణ్యత పరీక్షలు



వైఎస్సార్ జలాశయాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని నీటి సంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, వైఎస్సార్ జలాశయాలను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఇంజినీరింగ్ సిబ్బందితో కలసి గురువారం క్లోరోస్కోప్ ద్వారా నీటినాణ్యత పరీక్షలను నిర్వహించారు. పట్టణంలోని అన్ని సంపులరోపాటు 60 బోర్ల నుంచి సరఫరా అవుతున్న నీటి నమూనాలను పరిశీలించారు. డైరెక్ట్ పంపింగ్ అవుతున్న నీటిని పరీక్షల ద్వారా నీటి నాణ్యతను గమనించారు. ఇళ్లలో నీరు ఎక్కువరోజులు ఉంచుకోరాదని, ఇలా చేస్తే వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



రెడ్డి రాహుల్

పలమనేరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన రెడ్డి రాహుల్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడని హెచ్‌ఎం షంషీర్ గురువారం తెలిపారు. తమ స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు సైతం ఎంపికయ్యారని చెప్పారు.

సదుంలో ఐదుగురు..

సదుం: స్థానిక ఎంజేపీ గురుకుల పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రిన్సిపల్ శ్రీనివాసుల రెడ్డి గురువారం తెలిపారు. తేజ, యోగీశ్వర్, చరణ్, కార్తిక్, లీలాధర్ ఎంపికయ్యారని తెలియజేశారు.

జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ



పుంగనూరులో పోస్టర్లు విడుదల చేస్తున్న డాక్టర్ రంజిత



సదుం: ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది





సోమల: పాదలకుంట పల్లెలో నిర్వహిస్తున్న ర్యాలీ, రొంపిచెర్ల: ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పుంగనూరు: స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో మెడికలాఫీసర్ రంజిత ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ జయేష్‌బాబు నేతృత్వంలోనూ ఇదే కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేయరాదన్నారు. కుటుంబ నియంత్రణ, కాన్పుల మధ్య ఉండాల్సిన అంతరం తదితర విషయాలపై మహిళలకు వివరించారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. అలాగే శుభారాం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ అవగాహన సదస్సు నిర్వహించారు. జనాభా పెరిగే కొద్దీ వృద్ధి రేటు తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

సదుం: బాల్య వివాహాలతో అనర్థాలు తప్పవని డాక్టర్ చరణ్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాన్పుల నడుమ ఉండాల్సిన అంతరం, కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది నీలకంఠ, జానకి, రేవతి, హేమలత, సరస్వతి, సత్తాజ్, సుమలత, దీప, శ్రావణి, మనీషా పాల్గొన్నారు.

సోమలలో..

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బంది, డాక్టర్ ప్రదీప్ కమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమల ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాదలకుంటపల్లెలోనూ ఇదే కార్యక్రమం నిర్వహించారు. జనాభా పెరిగిపోవడం వల్ల దేశం, సమాజంపై కలిగే ప్రభావం గురించి, దీనిని నివారణోపాయాల గురించి వివరించారు. కుటుంబ నియంత్రణ పాటించాలని కోరారు. సీహెచ్‌ఓ అమర్‌నాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణతోనే తల్లీ బిడ్డ ఆరోగ్యం

రొంపిచెర్ల: కుటుంబ నియంత్రణతోనే తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని అధిక జనాభా వలన కలిగే నష్టాలపై రొంపిచెర్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జనాభా నియంత్రణకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుకోవాలని, ఒక్కరు లేదా ఇద్దరు బిడ్డలకు మాత్రమే జన్మనివ్వాలన్నారు. అధిక జనాభా వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ వినయ్, సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వాతావరణానికి అనుగుణంగా సాగు



మాట్లాడుతున్న రాధాదేవి

రేణిగుంట: మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడి సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రాధాదేవి అన్నారు. మండలంలోని ఎస్‌యాపురంలో గురువారం ఆమె రైతులకు సమావేశం నిర్వహించారు. వ్యవసాయంలో అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏఓ కేవీ శ్రీనివాస్, వ్యవసాయ సహాయకులు ధనశేఖర్, రైతులు పాల్గొన్నారు.

విశ్రాంత లెక్చరర్ మృతి



భాస్కర్(ఫైల్)

పలమనేరు: పట్టణానికి చెందిన విశ్రాంత ఆంగ్ల అధ్యాపకులు భాస్కర్ అలియాస్ బొంబుల్ భాస్కర్(66) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేశారు. వేలాదిమంది ఆయన వద్ద విద్యనభ్యసించి, ఆంగ్లంలో పట్టు సాధించి, ఉన్నత స్థానాల్లో ఉన్నారు. రెండు దశాబ్దాల పాటు ఆంగ్లంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



మండలాధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: ప్రజలు, ఉపాధి కూలీలు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ఇంజినీరింగ్ శాఖ, ఉపాధి హామీ పనులకు సంబంధించి అధికారులతో జెడ్పీ చైర్మన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజల నుంచి అందిన వినతులపై ప్రత్యేక దృష్టి సారించి, జాప్యం చేయకుండా సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరించాలన్నారు. అధికారులపై నమ్మకంతో ప్రజలు కార్యాలయాలకు వస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయరాదన్నారు. కార్యక్రమంలో ఏపీఓ అశోక్, పీఆర్‌ఏఈ శ్రీనివాసులు, ఎంపీడీఓ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించకపోతే కేసులు



పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ జయరామయ్య

పుంగనూరు: వాహనచోదకులు ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని, విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ జయరామయ్య హెచ్చరించారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రోడ్డు మీద ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయడం, పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో తీసుకెళ్లడం, హెల్మెట్ ధరించకుండా ట్రిపుల్ రైడింగ్ చేయడం..వంటివి చేయరాదన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలను నడిపినా, మితిమీరిన వేగం, విపరీతమైన హారన్లమోత, రహదారిపై ఫీట్లు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



మామిడిలో కొమ్మల కత్తిరింపు గురించి వివరిస్తున్న హెచ్‌ఓ వరప్రసాద్

పెద్దపంజాణి: మామిడిలో కోత అనంతరం సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని హార్టికల్చర్ ఆఫీసర్ వరప్రసాద్ చెప్పారు. గురువారం మండలంలోని వీరప్పల్లెలో మామిడిలో కొమ్మల కత్తిరింపుల ఆవశ్యకతను రైతులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ, కాయలు కోసిన వెంటనే జూలైలో కొమ్మలను కత్తిరించాలన్నారు. పూత వచ్చే కొమ్మలను చివరి భాగం కత్తిరించి, ఎండుకొమ్మలను తీసివేయాలన్నారు. అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను తొలగించి గాలి, ఎండ ధారాళంగా తగిలేలా చూసుకోవాలన్నారు. తొలగించిన కొమ్మలకు తెగులు ఆశించకుండా సీఓసీ పేస్టు రాయాలన్నారు. అలాగే సీఓసీ లీటర్ నీటిలో మూడు గ్రాములు కలిపి చెట్టు మొత్తం తడిచేలా పిచికారీ చేస్తే తేనెమంచు పురుగు, తెగుళ్లను అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలోఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరిస్తే ప్రాణరక్షణ



పట్టణంలో హెల్మెట్ ధారణపై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

- సీనియర్ సివిల్‌జడ్జి శ్రీనివాసరావు

పలమనేరు: మోటార్ సైక్లిస్టులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలో న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ, ఇటీవల జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో తలకు దెబ్బలు తగిలి చనిపోయిన వారెందరో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాల్లో భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోందనేది గ్రహించాలని హితవు పలికారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణ రక్షణ అని, అలా చేసి ఉన్నపక్షంలో ప్రమాదాల్లో ప్రాణాలతో బైటపడి ఉండేవారన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాలకు తీరని దుఃఖం మిగులుతుందనేది ప్రతి ఒక్కరూ గుర్తెరగాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కోర్టు న్యాయవాదులు పరమశివప్ప, భాస్కర్, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బలిజలంతా ఏకతాటిపై నడుద్దాం



గురుపూజ బ్యానర్లను ఆవిష్కరిస్తున్న బలిజ కులపెద్దలు

వి.కోట: బలిజకులస్తులంతా ఏకతాటిపై నడుద్దామని ఆ కులపెద్ద ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో బలిజ కులస్తు సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభాకర్ మాట్లాడుతూ పౌర్ణమి సందర్భంగా నాదబ్రహ్మ సద్గురు శ్రీ యోగి నారేయణ తాతాగారి గురుపూజ సంగీతోత్సవం నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 19నుంచి మూడు రోజులు నిర్వహించే ఈ మహోత్సవంలో తాతాగారి సంగీతార్చన కార్యక్రమాన్ని మండలంలోని బలిజ కులస్తులు, కుల పెద్దలందరూ విజయవంతం చేయాలని కోరారు. దీనికి సంబంధించి బ్యానర్లను ఆవిష్కరించారు. బలిజ కులస్తులు క్రిష్ణమూర్తి, సతీష్ కుమార్, ముకుంద, మధు, జనార్ధన్, నాని, శివ, అమర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్రామపెద్దల సన్మానం



సన్మానం అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్దపంజాణి: మండలంలోని సుద్దగుండ్లపల్లె గ్రామ పెద్దలు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన 13 మంది విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం గ్రామ పెద్దలు, యువకులు, ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు వారిని సన్మానించారు. శాలువలు కప్పి, జ్ఞాపికలును బహూకరించారు. పలువురు వక్తలు మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా కొనసాగించి పిల్లలను ప్రోత్సహిస్తామని గ్రామ పెద్దలు చెప్పారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ, సన్మాన కార్యక్రమం ద్వారా తమను ప్రోత్సహిస్తున్న మంజునాథ్, గ్రామ పెద్దలు, గురువులకు ధన్యవాదాలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పేరు నిలబెడతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోతయ్య, వెంకటేష్, సర్పంచ్ పార్వతమ్మ, గ్రామ పెద్దలు చిన్నబ్బ, రామకృష్ణ, మల్లిఖార్జున, గంగిరెడ్డి, మనోహర, మల్లిఖార్జున పాల్గొన్నారు.